ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

పెంచలకోనలో గరుడోత్సవానికి పోటెత్తిన భక్తులు



బంగారు గరుడవాహనంపై శ్రీవారు

డక్కిలి, మే 22: కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేరా భక్తజనమే.. ఎవరినోట విన్నా పెంచలో.. పెంచలా.. గోవిందా.. గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహ.. అనే నామ స్మరణే. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసిపోతున్న గరుడ్మంతుడిపై నరసింహ స్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు. నృసింహస్వామి జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన కిక్కిరిసింది. ఉదయం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించారు. శ్రీదేవి, భూదేవితో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామివారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీకే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై స్వామివారు

నేడు కల్యాణం :

కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ఆరు గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవ నిర్వహిస్తారు.



గంగమ్మ విశ్వరూపం

- పులకించిన భక్తజనం
- ముగిసిన జాతర

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడంతో వారం రోజుల గంగ జాతర వేడుక ముగిసింది. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పేరంటాల వేషం ధరించిన కైకాల వంశస్తుడు సాంబ గంగమ్మకు ఆలయానికి చేరుకున్నాడు. అప్పటికే ఆచారులు విశ్వరూప స్తంభానికి ఎండుగడ్డి, బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారుచేసి ఉంచడంతో భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య పేరంటాల వేషధారి చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. మన్ను దొరికినవారు ఎంతో పవిత్రంగా ఇంటికి తీసుకెళ్లారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి నుంచి కూడా మగవారు ఆడ వేషాలు ధరించి.. డప్పుల వాయిద్యాలతో ఒక్కో వీధి నుంచి బృందాలుగా ఏర్పడి.. చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయి, దర్శనం చేసుకుని తిరుగుముఖంపట్టారు. దీంతో జాతర మహోత్సవం పరిసమాప్తి అయ్యింది.



పేరంటాల వేషంలో కైకాల వంశస్తుడు సాంబ



కూచువారిపల్లెలో నిర్వహిస్తున్న ఫ్లాగ్ మార్చ్

జిల్లా అంతటా రెడ్ అలర్ట్

కౌంటింగ్‌కి వారం ముందు నుంచే కఠిన ఆంక్షలు

- 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలు

తిరుపతి(నేరవిభాగం), మే 22: పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల చెలరేగిన హింస నేపథ్యంలో కౌంటింగ్‌కి వారం ముందు నుంచే జిల్లా అంతా రెడ్ అలర్ట్ ప్రకటించాలని నిర్ణయించారు. ముఖ్యంగా కౌంటింగ్ రోజున హింసకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాత పగలను దృష్టిలో పెట్టుకుని గెలిచినవారు ఆనందోత్సాహాలతోనూ, ఓడినవారు నిస్పృహతోనూ దాడులకు తెగబడే అవకాశాలు ఉన్నాయని నిఘా వర్గాలు హెచ్చరించడంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు పూనుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 696 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా, అందులో చంద్రగిరి నియోజకవర్గంలోనే 397 ఉన్నాయి. వీటిలో 202 సమస్యాత్మక కేంద్రాలుగా ఎన్నికల సంఘం గుర్తించి 100 శాతం వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసింది. అయినా ఎన్నికల తర్వాత హింసను పోలీసు యంత్రాంగం నిరోధించలేక పోయింది. కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, పులివర్తివారిపల్లె, బ్రాహ్మణకాలువ, తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీల వద్ద చోటు చేసుకున్న ఘటనల్లో పోలీసులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో దాదాపు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈప్రదేశాలతోపాటూ చంద్రగిరి నియోజకవర్గంలోని నడవలూరు, దిగువ రామాపురం, అనుప్పల్లె, పాకాల మండలం పులివర్తివారిపల్లె, వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి, గూడూరు నియోజకవర్గం చిల్లకూరు ప్రాంతాల్లోనూ ముందస్తుగా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులతో సమావేశమయ్యారు. చంద్రగిరి మండలం కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె గ్రామాలను ఆయన స్వయంగా పరిశీలించి అక్కడ నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. బుధవారం ఆ రెండు గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, ఇంటెలిజెన్సు వర్గాల హెచ్చరికలతో అనుమానం ఉన్న గ్రామాలను జల్లెడ పడుతున్నారు. వీటితోపాటు సమస్యాత్మక గ్రామాలు, పట్టణాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, అనుమానం ఉన్నవారు, కొత్త వ్యక్తులు, స్థానికంగా నివాసం లేకుండా తలదాచుకోవడానికి వచ్చిన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ఎన్నికల సమయంలో గొడవలు జరిగిన ప్రాంతాలను కూడా పరిగణనలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ పూర్తయిన 15 రోజుల తర్వాత సైతం సెంట్రల్ బలగాలు అన్ని ప్రాంతాల్లో గట్టి బందోబస్తు నిర్వహించనున్నాయి.

బాటిళ్లలో పెట్రోలు, టపాసుల విక్రయాలపై నిషేధం

జిల్లా అంతటా బాణాసంచా విక్రయ కేంద్రాలు, బాటిళ్లలో పెట్రోలు అమ్మకాలను పూర్తిగా నిషేధించారు. కౌంటింగ్‌కు వారం ముందు నుంచి అన్ని బాణాసంచా దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎస్‌పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లు, సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టి.. కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు అమలు చేయని పెట్రోలు బంకులు మూసివేయాలని సైతం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

సీఆర్‌పీఎఫ్ నీడలో చంద్రగిరి, తిరుపతి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలను సీఆర్‌పీఎఫ్ బలగాల నీడలో ఉంచనున్నారు. శివారు ప్రాంతాల్లోనూ దూరంగా ఉన్న ఇళ్లలోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలున్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని అడుగుతున్నారు. తమ తనిఖీల్లో బయట పడితే మాత్రం హిస్టరీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా అదుపులోకి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో పోలింగ్ అనంతరం హింసకు పాల్పడినవారిని వెతికి పట్టుకునేందుకు ప్రత్యేకంగా 10 టీములు ఏర్పాటు చేశారు. వీరు ఎక్కువగా ఆ రెండు నియోజకవర్గాలపైనే దృష్టి కేంద్రీకరించారు.

వారేం చేస్తున్నారంటే..?

- 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీ అభ్యర్థుల కార్యకలాపాలిలా

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 13న పోలింగ్ ముగిసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పోలింగ్ సరళిపై రెండు, మూడ్రోజులపాటు వరుస సమీక్షలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తలమునకలయ్యారు. బూత్ స్థాయి ఏజెంట్లు మొదలుకుని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నేతలు, నమ్మకస్తులైన అనుచరులతో మాట్లాడి తమ విజయావకాశాలపై ఓ అంచనాకు వచ్చారు. ఎక్కడ ఏమి జరిగిందో, బలహీనపడింది ఎక్కడో, బలంగా ఉన్నది ఎక్కడో తెలుసుకున్నారు. పార్టీలో తమ గెలుపునకు పని చేసింది ఎవరో, పనిచేయకుండా చేసినట్టు నటించిందెవరో గుర్తించేందుకు యత్నించారు. ఈ కసరత్తు అంతా ముగించాక ఒత్తిడి తగ్గించుకునేందుకు కొందరు కుటుంబాలతో విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లి వచ్చారు. మరికొందరు రెండు, మూడు నెలలుగా నిర్లక్ష్యం చేసిన వ్యాపారాలపై దృష్టి సారించారు. కొందరు స్థానికంగానే ఉంటూ కార్యకర్తలు, నాయకులను కలుసుకుంటున్నారు. పోలింగ్ దాకా సుడిగాలి పర్యటనలు, ప్రచారాలతో ఉక్కిరిబిక్కిరైన అభ్యర్థులు పోలింగ్ ముగిశాక ఏం చేస్తున్నారోనన్న ఆసక్తి జనంలో నెలకొంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల కార్యకలాపాలను ఆంధ్రజ్యోతి నెట్‌వర్కు పరిశీలించింది.

- వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ పోలింగ్ తర్వాత వెంకటగిరిలోనే అందుబాటులో ఉండి కార్యకర్తలు, నాయకులను కలుస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుటుంబంతోసహా పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. బుధవారం కర్ణాటకలోని ధర్మస్థలలో ఉన్నారు.
- వెంకటగిరి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ పోలింగ్ ముగియగానే హైదరాబాదు వెళ్లిపోయారు. గత సోమవారం వెంకటగిరి వచ్చారు. మంగళవారం తిరుపతి గంగజాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి అటే హైదరాబాదు తిరిగి వెళ్లారు.

- గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ పోలింగ్ తర్వాత స్థానికంగానే అందుబాటులో ఉన్నారు. మంగళవారం వ్యక్తిగత పనులపై హైదరాబాదు వెళ్లారు.
- గూడూరు వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ స్థానికంగా ఉంటూ కేడర్‌ను కలుసుకుంటున్నారు. బుధవారం ఆయన కుటుంబంతో కలసి తిరుమల వెళ్లారు.

- శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోలింగ్ తర్వాత స్థానికంగానే ఉండి కేడర్‌ను కలిశారు. నాలుగు రోజులుగా హైదరాబాదులో ఉన్నారు.
- శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి కూడా పోలింగ్ తర్వాత కొద్ది రోజులు ఇక్కడే కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. గత సోమవారం విజయవాడ వెళ్లారు.

- సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ పోలింగ్ తర్వాత తిరుపతిలో ఉంటున్నారు. ఆమె తండ్రి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మాత్రం నాయుడుపేటలోని స్వగృహంలో ఉంటున్నారు. అభ్యర్థి తరఫున ఆయనే కేడర్‌తో సమీక్షించి వివరాలు తెలుసుకుంటున్నారు.
- సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య పోలింగ్ తర్వాత కొద్ది రోజులు కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. ఇటీవల డెహ్రాడూన్ వెళ్లి వచ్చిన ఆయన మంగళవారం నెల్లూరులో, బుధవారం నాయుడుపేటలో ఉన్నారు.



సత్యవేడులో అనారోగ్యంతో బాధపడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఆదిమూలం



తిరుపతిలో సత్యవేడు నాయకులతోపాటు మంత్రి పెద్దిరెడ్డిని కలసిన రాజేష్

- సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం పోలింగ్ ముగిశాక పుత్తూరు శివార్లలోని స్వగృహంలోనే ఉంటున్నారు. రోజువారీ నియోజకవర్గంలో పర్యటిస్తూ కేడర్‌ను కలుసుకుంటున్నారు. బుధవారం ఆయన సత్యవేడు, పిచ్చాటూరుల్లో పర్యటించారు.
- సత్యవేడు వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ పోలింగ్ తర్వాత నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. ఆయన తిరుపతిలో ఉంటూ నాయకులను, కార్యకర్తలను అక్కడే కలుస్తున్నారు. బుధవారం రాజేశ్ మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు.



పులివర్తి నానీని పరామర్శిస్తున్న కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు



సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి తండ్రి మృతికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్ రెడ్డి

- చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తిరుపతి శివార్లలోని తన నివాసంలో ఉంటున్నారు. నియోజకవర్గంతో పాటు పలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న పార్టీ నాయకులను, ఇతర ముఖ్యులను కలుస్తున్నారు. బుధవారం నానీని కృష్ణా జిల్లా తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు కలసి పరామర్శించారు.
- చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోలింగ్ ముగిశాక తుమ్మలగుంటలోని స్వగృహంలోనే ఉంటున్నారు. కేడర్‌ను కలుస్తున్నారు.తిరుపతి రూరల్ మం డలం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబీకులను మోహిత్ పరామర్శించారు.

- తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పోలింగ్ ముగిశాక కూడా తిరుపతిలోనే ఉంటున్నారు. బుధవారం ఆయన్ను జనసేన నేత హరిప్రసాద్, రిటైర్డు ఉద్యోగులు కలిశారు.
- తిరుపతి వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి కూడా పోలింగ్ ముగిశాక తిరుపతిలోనే కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. గంగజాతరలో బిజీగా గడిపిన ఆయన జాతర ముగియడంతో బుధవారం నివాసంలోనే గడిపారు.



విశ్రాంత ఉద్యోగులతో ఆరణి శ్రీనివాసులు



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం

ఆలయంలో 45 నిమిషాలు గడిపిన రేవంత్‌రెడ్డి

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఎం హోదాలో తొలిసారిగా తన సతీమణి, కుమార్తె, అల్లుడు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు మనవడి పుట్టెంట్రుకల మొక్కుకుని సమర్పించారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సామాన్య భక్తుడిలా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి 8.30 గంటలకు వెళ్లారు. అనంతరం ఆలయంలోనే సుమారు 45 నిమిషాలు గడిపారు. కాగా, దర్శనం పూర్తయి అతిథి గృహానికి చేరుకునే వరకు తన మనవడిని ఎత్తుకునే కనిపించారు రేవంత్‌రెడ్డి. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చినప్పుడైతే భుజంపై ఎత్తుకుని సంబరపడ్డారు. ఆలయం ముందు కొంతదూరం చేయిపట్టుకుని నడిపించారు కూడా.వాహనం ఎక్కే సమయంలో దగ్గరికి వచ్చిన అభిమానులతో ఓపిగ్గా ఫొటోలు దిగారు. అతిథిగృహానికి చేరుకుని 9.50 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

విద్యుదాఘాతంతో గూడబాతు మృతి

- కళేబరం తీగలకు చిక్కుకోవడంతో 4గంటలపాటు విద్యుత్ అంతరాయం

దొరవారిసత్రం, మే 22: గూడబాతు (పెలికాన్ పక్షి) ఒకటి విద్యుదాఘాతంతో మృతి చెందింది. దొరవారిసత్రం మండలంలోని వడ్డిపాళెం సమీపంలో ఈ ఘటన జరిగింది. పులికాట్ సరస్సులో సేద దీరే ఈ పక్షి ఆకాశంలో వెళుతూ బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వడ్డిపాళెం సమీపంలో విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. అనంతరం షార్ట్‌సర్క్యూట్ కావడంతో మృతి చెందింది. ఈ ఘటనలో కళేబరం తీగల మధ్యే ఉండటంతో దొరవారిసత్రం, గోకుల క్రిష్ణ కాలేజి సమీపంలో రెండు చోట్ల 33-11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అలాగే మన్నారుపోలూరు 22 కేవీ లైన్ ఇన్సులేటర్ ధ్వంసమైంది. దీంతో దొరవారిసత్రం, తల్లంపాడు, పూలతోట సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చి కళేబరాన్ని తొలగించి, ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం పక్షి కళేబరాన్ని నేలపట్టు పక్షుల కేంద్ర అధికారులకు అప్పగించారు. వారు దాని పూడ్చి పెట్టారు.



గూడబాతు కళేబరం

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి తిరుమంజనం

రామచంద్రాపురం, మే 22: నృసింహస్వామి జయంతి సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయ ఉపాలయంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి బుధవారం వైభవంగా తిరుమంజనం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా గంగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి సేవలో విశాఖ శారద పీఠాధిపతి

తిరుచానూరు, మే 22: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

పులివర్తి నానీకి పలువురి పరామర్శ


నానీని పరామర్శిస్తున్న భానుప్రకాష్

తిరుచానూరు, మే 22: వైసీపీ అల్లరి మూకల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం పలువురు పరామర్శించారు. రఘునాథ రిసార్ట్స్‌లోని ఆయన స్వగృహంలో నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, తిరుపూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు వేర్వేరుగా కలిసి పరామర్శించారు.

వైభవంగా అర్జున తపస్సు


తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

భాకరాపేట, మే 22: చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో జరుగుతున్న 73వ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం జరిగింది. భక్తులు తపస్సు మాను వద్ద పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్జున వేషధారి విసిరిన విభూది, నిమ్మ పండ్లు, పూల కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీవారు అన్నదానం చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్

చంద్రగిరి, మే 22: ఎన్నికల పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల దృష్ట్యా కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, ఎ.రంగంపేట, ఐతేపల్లె, అగరాల, శానంబట్ల, తొండవాడ గ్రామాల్లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో సీఆర్‌పీఎఫ్ బలగాలతో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సీఐ రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్‌ప్రసాద్, చంద్రగిరి ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మా కుమారుడిని చంపేశారు.. న్యాయం చేయండి

పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులతో కలిసి తల్లిదండ్రుల ధర్నా


పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న తలారిపల్లె గ్రామస్తులు - ఇన్‌సెట్‌లో మురళి (ఫైల్ ఫొటో)

పాకాల, మే 22: 'మా కుమారుడ్ని హత్యచేసి రైలు కిందపడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. నిందితులను అరెస్టు చేసి.. న్యాయం చేయాలి' అని గ్రామస్తులతో కలిసి మృతుడి తల్లిదండ్రులు పోలీసుస్టేషన్ ఎదుట బుధవారం సాయంత్రం ధర్నా చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇరంగారిపల్లె పంచాయతీ తలారిపల్లెకు చెందిన సి.మునస్వామి, పార్వతి దంపతుల కుమారుడు మురళి (30), ఫకీరుపేటకు చెందిన చాన్‌బాషా కుమార్తె ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకున్నారు. అమ్మాయి మైనర్ కావడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న ప్రేమజంటను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నుంచి మురళి కనిపించకుండా పోయాడు. సోమవారం ఉదయం ఊట్లవారిపల్లె సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భావించి శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అమ్మాయి కుటుంబ సభ్యులే హత్య చేసి రైలు కిందపడేశారని మురళి తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం రాత్రి రఫీ, కర్ణ అతని భార్య, పెద్దమ్మ తమ కొడుకును చంపేశారని సీఐ రాజగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని బోరున విలపించారు.

ఇస్కాన్‌లో నరసింహ జయంతి



తిరుపతి (కల్చరల్), మే 22: నరసింహస్వామి జయంతి సందర్భంగా బుధవారం ఇస్కాన్ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామికి మహా శంఖాభిషేకం జరిగింది. అనంతరం నరసింహస్వామి లీలల గురించిన ప్రవచనం జరిగింది.

పంటపొలాలపై ఏనుగుల దాడి


ఇ.పాలగుట్టపల్లె పంచాయతీలో వరిపంటను తొక్కేసిన ఏనుగులు

పాకాల, మే 22: మండలంలోని ఇ.పాల గుట్టపల్లె పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి ఏనుగులు పంటపొలాలను ధ్వంసం చేశాయి. చేతికి అందివచ్చిన వరి పంటను తొక్కేసి నాశనం చేశాయి. ఇ.పాల గుట్టపల్లె, దేవినేని ఇండ్లు, వెంకట్రామాపురం, వరదప్పనాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులకు ఏనుగులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కల్లూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తూ రాత్రుల్లో గ్రామాలపైకి వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ పరిసరాలలో కందకాలు లేకపోవడం, అడవిలో నీరు లేకపోవడంతో పొలాలపైకి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుయా నేత్ర నిధికి కళ్లు దానం


కుటుంబ సభ్యులు అందజేస్తున్న అంగీకార పత్రం

తిరుపతి(వైద్యం), మే 22: గుండెపోటుకు గురై రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన వ్యక్తి కళ్లను అదే ఆస్పత్రిలోని నేత్ర నిధికి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు దానం చేశారు. స్థానిక కొర్లగుంటకు చెందిన మరియదాస్(75) గుండెపోటుతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నేత్ర నిధి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. మృతుడి మనవరాలు సంధ్య తన తాత కళ్లను దానం చేసేందుకు అంగీకరించింది. దీంతో మరియదాస్ కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్ర నిధిలో భద్రపరిచారు. తీరని దుఃఖంలోనూ అయిన వారి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేత్ర నిధి టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్వీ వైద్య కళాశాలకు రెండు ఏసీల వితరణ

తిరుపతి(వైద్యం), మే 22: ఎస్వీ వైద్య కళాశాలలోని ఔషధ విభాగం విద్యార్థుల సౌకర్యార్థం రెండు ఎయిర్ కండీషనర్ల(ఏసీ)ను దాతలు అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔషధ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత, ప్రొఫెసర్ డాక్టర్ భారతిలు కలిసి రూ.1.20 లక్షల విలువచేసే రెండు ఏసీలను అందజేశారన్నారు.

హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

తిరుపతి అర్బన్, మే 22: ఎయిర్ బైపాస్‌రోడ్డులో భారతీయ హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శనశాలను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. జీవనజ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 40 స్టాల్స్‌కిపైగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన వచ్చే నెల 25వరకు కొనసాగుతుందని నిర్వాహకులు అతిన్‌కుమార్ జైస్వాల్ తెలిపారు.

గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిట


అమ్మవారి విశ్వరూపం వద్ద ఆలయ చైర్మన్ తదితరులు, సూర్యకిరణాలు పడకుండా తెర, పేరంటాల వేషధారి


పేరంటాల వేషధారి చెంప నరకడంతో మన్ను కోసం పోటీపడుతున్న భక్తులు

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. విశ్వరూప దర్శనం సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ఆరణి హర్షం : తిరుపతి గంగ జాతర ప్రశాంతంగా ముగియడంతో ఎన్డీఏ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గంగమ్మ విశ్వరూప దర్శనం కోసం భక్తులు రాత్రంతా వేచివున్నారంటే అమ్మవారిపై ఉన్న భక్తి విశ్వాసాలు ఏపాటివో తెలుస్తోందన్నారు. నగర ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.


ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్న భక్తులు




భక్తులను అదుపుచేస్తున్న పోలీసులు



అమ్మవారి వసంతోత్సవాలు ప్రారంభం


ప్రకృతి రమణీయతతో భారీ సెట్టింగ్ - బంగారు పీఠంపై పద్మావతిదేవి

తిరుచానూరు, మే 22: తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని మధ్యాహ్నం ఆలయ సమీపంలోని ఫ్రైడే గార్డెన్స్‌కు వేంచేపుచేసి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో.. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి నేత్రపర్వంగా అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పద్మావతిదేవి తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 7.45గంటలకు అమ్మవారికి స్వర్ణ రథోత్సవం జరగనుంది.

ప్రకృతి ఒడిలో వసంతోత్సవం

పద్మావతిదేవికి మూడు రోజుల పాటు జరిగే వసంతోత్సవాల కోసం మండపాన్ని నందన వనంలా శోభాయమానంగా అలంకరించారు. ప్రకృత రమణీయత ఉట్టిపడేలా భారీ సెట్టింగ్‌తో తీర్చిదిద్దారు. థర్మాకోల్‌తో తయారు చేసిన వివిధ రకాల జంతువులు, పక్షులను టీటీడీ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది అద్భుతంగా తీర్చిదిద్దారు. వన్యప్రాణుల సవ్వడులు, పక్షుల కిలకిలరావాలు వినిపించేలా సౌండ్ సిస్టమ్ అమర్చారు. ఇక పుష్పాలంకరణ భక్తులను చూపుతిప్పుకోనివ్వడం లేదు.

వసంత మండపంలో శాస్త్రోక్తంగా నృసింహపూజ



తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా నృసింహ జయంతి సందర్భంగా టీటీడీ తిరుమల వసంత మండపంలో బుధవారం నృసింహ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించింది. అలాగే శ్రీవారి ఆలయంలోని యోగనరసింహస్వామికి బుధవారం ప్రత్యేకాభిషేకం నిర్వహించారు. ఆలయ మొదటి ప్రాకారంలో గర్భాలయాలనికి ఈశాన్యం వైపున గల మండపంలో యోగనరసింహస్వామి ఆలయం ఉంది. యోగముద్రలో ఉన్న ఈ విగ్రహానికి అర్చకులు విశేషంగా అభిషేకం చేశారు.

సహజ కవయిత్రి తరిగొండ వెంగమాంబ

తిరుపతి (కల్చరల్), మే 22: శ్రీవారి పరమ భక్తురాలు తరిగొండ వెంగమాంబ సామాన్యులు సైతం అర్థం చేసుకునే ప్రజాకవిత్వం ద్వారా స్వామివారి వైభవాన్ని లోకానికి తెలియజేసిన సహజ కవయిత్రి అని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి అన్నారు. వెంగమాంబ జయంతి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సాహిత్యసభకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ వి.ఆర్.రాసాని, టీటీడీ వేటూరి ప్రభాకర శాస్త్రి పీఠం సహాయ పరిశోధకులు డాక్టర్ కేశవులు, డాక్టర్ బాలాజీ దీక్షితులు ప్రసంగించారు. సాయంత్రం జరిగిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల సంగీత విభావరి అలరించింది.

వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వెంగమాంబ బృందావనంలోని ఆమె విగ్రహానికి టీటీడీ వెంగమాంబ ప్రాజెక్ట్ సంచాలకులు భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి పుష్పాంజలి సమర్పించారు. అంతకుముందు నాదనీరాజనం వేదికపై టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణప్రసాద్‌తోపాటు ప్రముఖ అన్నమాచార్య ప్రాజెక్ట్ గాయని బుల్లెమ్మ వెంగమాంబ రచించిన కీర్తనలను అత్యద్భుతంగా ఆలపించారు. క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, వెంగమాంబ వంశీయులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్‌సెట్ ఫలితాల్లో పురుషులదే పైచేయి


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి, కన్వీనర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: ఏపీ ఆర్‌సెట్ (ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో పురుషులు పైచేయి సాధించారని కన్వీనర్ దేవప్రసాదరాజు తెలిపారు. బుధవారం ఫలితాలను ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి విడుదల చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు కన్వీనర్‌గా సమర్థవంతంగా పరీక్షను నిర్వహించారని ప్రశంసించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 17 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా.. 4352 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 2,226 మంది పురుషులు, 2,126 మంది మహిళలు ఉన్నారని వివరించారు. దేవప్రసాదరాజు మాట్లాడుతూ.. 2,728 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి ఏపీ ఆర్‌సెట్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కిషోర్, కుమారస్వామి, కుసుమ హరినాథ్, సిబ్బంది కామేష్, నాగభూషణం, సుకుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ పీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్త్రీ శక్తికి వెంగమాంబ ప్రతీక

స్వరూపానందేంద్ర స్వామి


స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ స్త్రీ శక్తికి, సాధికారతకు ప్రతీక అని, ఆమె కాలంలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన భక్తుల్లో ఒకరిగా నిలిచారని విశాఖ శారదపీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి పేర్కొన్నారు. వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు బుధవారం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర స్వామిజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. వెంగమాంబ రచనలు సాక్షాత్తూ శ్రీవారు అంగీకరిచినట్టు చెప్పారు. వెంగమాంబ సంకీర్తల రెండు పుస్తకాలను, సీడీని విడుదల చేశారు.

ఆకట్టుకున్న వెంగమాంబ సంకీర్తన గోష్టిగానం

అంతకుముందు సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ ప్రారంభమైంది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, ప్రముఖ గాయని శ్రీనిధితో పాటు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్టిగానం నిర్వహించగా, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈవో ధర్మారెడ్డి, జేఈవో గౌతమి, శ్వేత సంచాలకులు భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణశర్మ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు స్వరూపానందేంద్ర స్వామిని తిరుమల శారద మఠంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై గోవిందుడి చిద్విలాసం

నేడు రథోత్సవం


సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు

తిరుపతి(కల్చరల్), మే 22: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ జరిగింది. తరువాత రాత్రి 7 గంటలకు స్వామి వారు చంద్రప్రభ వాహనంపై కృష్ణుడి రూపంలో మాడవీధుల్లో వేచి ఉన్న భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామి వారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వాహనసేవ ముందు వేదపండితులు, జియ్యరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. మాడవీధుల్లో ప్రదర్శించిన వివిధ కళారూపాలు, నృత్యాలు విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయరు స్వామి, చిన్నజీయరు స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ పాల్గొన్నారు. కాగా, గురువారం ఉదయం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ జరుగుతుంది.

ఆంధ్రప్రదేశా? ఆఫ్ఘనిస్తానా? : బీజేపీ


భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే మనం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా? ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసీపీ చేసిన అరాచకాలకు సంబంధించిన 400 వీడియోలు ఇంటర్‌నెట్‌లో ఉన్నాయని చెప్పారు. చట్ట సభలు దేవాలయాలతో సమానమని, ఇలాంటిది మాచర్ల, పల్నాడు, తాడిపత్రి, చంద్రగిరి ప్రాంతాల్లో చోటు చేసుకున్న పరిణామాలు వైసీపీ అరాచకాన్ని తెలియజేస్తున్నాయన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరిస్థితి ఇలా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముందని ప్రశ్నించారు. సీఎం జగన్ కౌంటింగ్ తర్వాత శాశ్వతంగా విదేశీ పర్యటనకు వెళ్ళవచ్చని అన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని భానుప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాయకులు వరప్రసాద్, చంద్రశేఖర్, శేఖర్, నరేన్, నాదముని పాల్గొన్నారు.

ఏపీలో కూటమిదే విజయం: చింతా మోహన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: ఏపీలో కూటమిదే విజయమని మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీకి ఓటమి తప్పదని అభిప్రాయపడ్డారు. ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీల పాత్ర కీలకం కానుందన్నారు. ఎన్నికల్లో డబ్బు వెదజల్లుతుంటే ఎన్నికల కమిషన్ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఓ జనరల్ స్థానంలో రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. గూడూరు ఎస్సీ రిజర్వు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒక పోలీసు అధికారి స్వయానా రూ.45 కోట్లు డబ్బు పంపిణీ చేశారని ఆరోపించారు. ఈవీఎంలను కూడా మార్పు చేర్పులు చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. రేణిగుంట రోడ్డులో కూడా ఒక చోట ఈవీఎంలు ఉన్నట్టు ప్రచారం జరుగుతుందని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి అధికారాన్ని చేపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గోపీగౌడ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు కోసం పోరాటం అవసరం: సీపీఎం

తిరుపతి(ఆటోనగర్), మే 22: దేశంలో పదేళ్లుగా బీజేపీ పాలనలో లౌకిక వాదం ప్రమాదంలో పడుతోందని, ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పార్టీ శ్రేణులు అధ్యయనంతో కూడిన పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తిరుపతి యశోదనగర్‌లోని ఎంబీ భవన్‌లో బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సీపీఎం కార్యకర్తలు, నాయకులకు ఎనిమిది రోజుల అధ్యయన సదస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వి.నాగరాజు, కందారపు మురళి, ప్రసాదరావు, చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి (కల్చరల్), మే 22: తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి పత్రపుష్పయాగం జరగనుంది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయంలో అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6 గంటలనుంచి స్వామి వారి తిరువీధి ఉత్సవం జరుగుతుంది. ఆసక్తి ఉన్న గృహస్తులు రూ.200 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), మే 22: ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా బుధవారం ప్రారంభమైంది. యోగిమల్లవరంలో ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల నిల్వ కేంద్రం వద్ద ఉదయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డీజీటీ ద్వారా పుస్తకాలను ఆయా పాఠశాలలకు తరలించారు. తొలివిడతగా 1.75లక్షల పుస్తకాలను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పాఠశాలకు చేరవేయనున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, ఆర్టీసీ కమర్షియల్ ఏటీఎం డి.ఆర్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

గెలుపు మాది.. కాదు మాదే!

● తిరుపతిలో ఉభయపార్టీల్లో ఒకే ధీమా



ఈవీఎం పెట్టెలు సీలు వేసిన గదుల్లో భద్రంగా ఉన్నాయి. తిరుపతి అభ్యర్థి ఎవరన్న తీర్పును తమ గర్భంలో దాచుకుని గంభీరంగా ఉన్నాయి. పార్టీల ప్రచారాలతో హోరెత్తిన నగరం శాంతించి, గంగజాతరను జరుపుకుంటోంది. ఇంతకీ తిరుపతి గెలుపు ఎవరిదనే అంశంపై చర్చ మాత్రం అన్ని వర్గాల్లో జోరుగా సాగుతోంది. భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయరెడ్డి తొలి గెలుపుతో అసెంబ్లీ మెట్లు ఎక్కుతారా లేక వైసీపీ పీని వీడి వచ్చిన ఆరణి శ్రీనివాసులు జనసేన గొంతును శాసనసభలో వినిపిస్తారా? ఉభయ పార్టీల్లోనూ రకరకాల విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కూడికలు, తీసివేతల లెక్కలతో అంచనాలు కడుతున్నారు. నవరత్న పథకాలే తమను గెలిపిస్తాయనే నమ్మకంతో వైసీపీ వర్గం ఉండగా, పెల్లుబికిన ప్రభుత్వ వ్యతిరేకతే తమకు విజయాన్ని అందిస్తుందని కూటమి పార్టీలు చెబుతున్నాయి. ఈ రెండు వర్గాల్లో కనిపిస్తున్న ధీమాకు కారణాలు ఇలా ఉన్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

భూమన ధీమా

- రెండేళ్లుగా పెద్దఎత్తున సమకూర్చుకున్న ఆర్థిక వనరులు.
- ప్రత్యర్థిని నాన్‌లోకల్ అని చేసిన ప్రచారం.
- తండ్రి భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచడం, టీటీడీ నిధులతో మరికొన్ని మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఆమోదం పొందడం.
- డిప్యూటీ మేయర్‌గా అభినయ రెడ్డి ఎన్నికైనప్పటినుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనంలో ప్రచారం కావడం.
- పోలింగ్‌కు వారం ముందు నుంచే ఏ అడ్డంకులూ లేకుండా తాయిలాల పంపిణీ జరగడం.
- కులాలవారీగా, కార్యాలయాల వారీగా నిర్వహించిన ఆత్మీయ సమావేశాల వల్ల అనేక మందిని అనుకూలంగా మార్చుకోగలిగామనే విశ్వాసం.
- మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం, నగరంలోని కొన్ని రోడ్లను వెడల్పు చేయడం వంటి అంశాలు ప్రజలకు నచ్చాయనే నమ్మకం.
- ఎపిక్ కార్డుల వివాదాన్ని లెక్క చేయకుండా నకిలీ కార్డులు సృష్టించి తమిళనాడు ప్రాంతం నుంచి మనుషులను రప్పించి దాదాపు 5వేల ఓట్లు వేయించినట్లు ఆ వర్గాల్లో వినిపిస్తున్న గుసగుసలు.
- దాదాపు 20వేల ఓట్ల ఆధిక్యత లభిస్తుందనే అంచనా.

ఆరణి నమ్మకం

- ఆర్థికబలం. ఖర్చుకు వెనుకాడకపోవడం.
- అసంతృప్తితో వున్న ఆశావహులంతా ఏకతాటిపై నిలచి పనిచేయడం.
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనతో నగరంలో ఒక్కసారిగా ట్రెండు మారిపోవడం.
- తిరుపతిలో టీడీపీకి బలమైన క్యాడర్ వుండడం, జనసేన యువ శక్తి తోడవడం, బీజేపీ ఎన్నికల వ్యూహాలతో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడం.
- ఆరణి శ్రీనివాసులు మృదుభాషి కావడం, ఆయన సామాజికవర్గం తిరుపతిలో పెద్ద సంఖ్యలో ఉండడం. సంపూర్ణంగా వారి అండ లభించడం.
- తిరుపతి అభ్యర్థి తాను కాదని, పవన్ కల్యాణ్ అంటూ, తాను ఆయన ప్రతినిధిని మాత్రమేనని చేసిన ప్రచారానికి లభించిన స్పందన.
- గత ఎన్నికల్లో వైసీపీ ఆధిక్యత కేవలం 708 ఓట్లు మాత్రమేననీ, ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 12వేల వరకు ఓట్లు వచ్చాయని, ఇవన్నీ కలిస్తే తన విజయం నల్లేరుమీద నడకేనని నమ్మకం.
- జీవకోన, ఆటోనగర్, పీకే లేఅవుట్, ఎంఆర్‌పల్లె వంటి ప్రాంతాల్లో బలమైన వైసీపీ కేడర్.. జనసేన, టీడీపీలో చేరడం.
- టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు పోటాపోటీగా పనిచేయడం.
- తిరుపతి స్థానికుల్లోనూ, వ్యాపారుల్లోనూ భూమన కరుణాకరరెడ్డిపై ఐదేళ్లుగా అణచిపెట్టుకుని ఉన్న వ్యతిరేకత.
- గంగజాతర సంప్రదాయాలను భూమన మార్చేశారనే సెంటిమెంటు జనంలో ఉండడం.
- ఎన్నికల ప్రచార సభల్లో చివరి రోజుల్లో భూమనలో బద్దలైన అసహనం. అప్పటిదాకా తాను సౌమ్యుడినంటూ ఆయన చెప్పుకున్న మాటలకు విరుద్ధంగా చేసిన ప్రసంగాలపై చదువుకున్న వర్గాల్లో పెరిగిన వ్యతిరేకత.
- తమకు మెజారిటీ 30వేలు దాటుతుందన్న అంచనా.

కౌంటింగ్ ప్రక్రియను బాధ్యతగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రవీణ్ కుమార్



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 22: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో ఎన్నికల కౌంటింగ్ అధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజరు, అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు విధానంపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మహిళా యూనివర్సిటీలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, ఓట్ల లెక్కింపు సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేలా ఆయా నియోజకవర్గాల ఆర్వోలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


తూపల్లె జనార్ధన్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 22: ఎస్వీయూనివర్సిటీ జాగ్రఫీ విభాగ పరిశోధకులు తూపల్లె జనార్ధన్ డాక్టరేట్ పొందారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మున్సిపాలిటీల్లోని మురికివాడలు - సామాజికార్థిక అధ్యయనం అంశంపై డాక్టర్ వై.శారద పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పలు సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని సీఈ దామ్లానాయక్ తెలిపారు. జనార్ధన్ సుదీర్ఘ కాలం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేశారు. జనార్ధన్‌కు డాక్టరేట్ రావడం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి, రామానాయుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, పలువురు జర్నలిస్టులు అభినందించారు.


గాయత్రిని అభినందిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

డాక్టర్ గాయత్రికి ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అవార్డు

తిరుపతి(వైద్యం), మే 22: స్విమ్స్‌లోని ఎండోక్రైనాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాయత్రి అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రైనాలజీ(ఏఏసీఈ) ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకోవడం అభినందనీయమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. ఈ అవార్డు అందుకున్న డాక్టర్ గాయత్రిని ఆయన ఛాంబర్‌లో బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న అమెరికాలో జరిగిన ఏఏసీఈ సదస్సులో డాక్టర్ గాయత్రి పాల్గొని ఫెలోషిప్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి అలోక్ సచన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీ డీఎస్పీగా వెంకటాద్రి బాధ్యతల స్వీకరణ


డీఎస్పీ వెంకటాద్రి - సీఐలు రామారావు - విశ్వనాథ చౌదరి

తిరుపతి(నేరవిభాగం), మే 22: తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) డీఎస్పీగా వెంకటాద్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలులో ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాకు బదిలీపై వచ్చారు. 2013 నుంచి డీఎస్పీ హోదాలో హైదరాబాదులో మూడేళ్లు పనిచేసి 2016లో కర్నూలుకు వచ్చారు. అక్కడ స్పెషల్ బ్రాంచ్, ఏసీబీలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసి ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధనరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే అలిపిరి సీఐగా రామారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విశ్వనాథ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. వీరు కూడా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా జీవవైవిధ్య దినోత్సవం


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

మంగళం, మే 22: ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు గుంటూరు వారి ఆధ్వర్యంలో విశ్వం హైస్కూల్ విద్యార్థులకు బర్డ్ వాక్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలను బయోట్రీమ్ సిల్విక్చలరిస్టు యశోదబాయ్, జూ క్యూరేటర్ సి.సెల్వం అందించారు. జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీష్, ఎర్రచందనం గోదాముల డీఎఫ్‌వో శివకుమార్, సామాజిక వన విభాగం డీఎఫ్‌వో ధర్మరాజులు, అసిస్టెంట్ క్యూరేటర్ నాగభూషణం, రాష్ట్ర కోఆర్డినేటర్ ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ జవహర్‌రెడ్డిని తక్షణం బదిలీ చేయాలి

జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తున్న రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డిని తక్షణం బదిలీ చేయాలని జనసేన నేత కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎస్‌గా జవహర్‌రెడ్డి ఉన్నారనే ధైర్యంతోనే వైసీపీ నాయకులు ఈవీఎంలను బద్దలు కొట్టడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. విశాఖలో జగన్ ప్రమాణ స్వీకారానికి రహస్యంగా స్థల పరిశీలన చేయడం జవహర్‌రెడ్డి తీరుకు నిదర్శనమని ఆరోపించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. కౌంటింగ్ పారదర్శకంగా సాగాలంటే సీఎస్‌గా జవహర్‌రెడ్డి ఉండకూడదని చెప్పారు. పులివర్తి నానీపై దాడిలో అమాయకులను అరెస్టు చేశారన్నారు. ఈ సమావేశంలో ఆకేపాటి సుభాషిణి, సుమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ

తిరుపతి అర్బన్, మే 22: లయన్స్‌క్లబ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల ఆవరణంలో అల్పాహారం వితరణ చేశారు. బాధితులకు, వారి సహాయకులకు దాదాపు 460మందికి అందజేశారు. సంఘం అధ్యక్షుడు మక్కిన భాస్కర్, కార్యదర్శి శంకర్, కోశాధికారి చక్రపాణి, మధు, మురళి, శీను, రామారావు పాల్గొన్నారు.

ప్రకాశంకాలనీలో కార్డన్ సెర్చి



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ తదితరులు

కోట, మే 22 : మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల ప్రకాశం కాలనీ, చెందోడు పంచాయతీలలో గల ఎన్టీఆర్ కాలనీలలో బుధవారం కోట పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చి జరిగింది. వాకాడు సీఐ హరికృష్ణ, కోట ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో తెల్లవారుజామునుంచే ఈ సోదాలు జరిగాయి. సరైన రికార్డులు లేని 20 ద్విచక్రవాహనాలు, 7 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానికులతో సమావేశమై ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని అతిక్రమించరాదన్నారు.

తేలికపాటి వర్షం



గూడూరు, మే 22: పట్టణంలో బుధవారం ఉదయం అరగంట పాటు తేలికపాటి వర్షం కురిసింది. అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో ఉదయం 8గంటలకు వర్షం కురిసింది. అనంతరం ఎండ కాయడంతో భిన్న వాతావరణం కారణంగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు అర్బన్, మే 22: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం సేవాసంస్థ ఆధ్వర్యంలో రమేష్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, శ్రీనివాసులు, యామిని, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 22: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పాశిం సునీల్‌కుమార్ గెలుపు కాంక్షిస్తూ...

ఛాతిపై పచ్చబొట్టు



వాకాడు, మే 22 : గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్ ఎన్నికల్లో గెలుపొందాలంటూ వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ రెడ్డిపాళేనికి చెందిన తీపలపూడి అన్వేష్ బుధవారం తన ఛాతిపై పచ్చబొట్టు వేసుకున్నాడు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పీఠాన్ని ఎక్కాలని, గూడూరు నియోజకవర్గంలో పాశిం గెలవాలని వాకాడు మండలంలోని యువత అంతా ఎదురుచూస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీ కొన్న లారీ: మోటర్ సైక్లిస్టు మృతి



నాగులు (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, మే 22: నాయుడుపేట - మేనకూరు సెజ్ ప్రాంతంలో బైక్‌ను లారీ ఢీ కొన్న సంఘటనలో మోటరు సైకిలిస్టు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఓజిలి మండలం తిరుమలపూడి గ్రామానికి చెందిన నాగులు(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అత్తగారిల్లైన భీమవరానికి తిరుమల పూడి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మేనకూరు సమీపంలోకి రాగానే లారీ ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నాగులుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పరిహారం కోసం రైతుల నిరసన



సాగరమాల రోడ్డు పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిల్లకూరు, మే 22: మండలంలోని చింతవరానికి చెందిన పలువురు రైతులు తమకు పరిహారం ఇవ్వాలని బుధవారం సాగరమాల రోడ్డు పనుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... తమకు ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ పట్టాలను మంజూరు చేసిందన్నారు. వాటిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఆ భూములను సాగరమాల ప్రాజెక్టు కోసం తీసుకున్నారే కానీ తమకు ఏలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. అయితే సీజేఎఫ్ఎస్ భూములకు కొందరికి పరిహారం ఇచ్చారని తమకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు తమకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

పంటపొలాలపై ఏనుగుల దాడి



ఇ.పాలగుట్టపల్లె పంచాయతీలో వరిపంటను తొక్కేసిన ఏనుగులు

పాకాల, మే 22: మండలంలోని ఇ.పాలగుట్టపల్లె పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి ఏనుగులు పంట పొలాలను ధ్వంసం చేశాయి. చేతికి అందివచ్చిన వరిపంటను తొక్కేసి నాశనం చేశాయి. ఇ.పాలగుట్టపల్లె, దేవినేని ఇండ్లు, వెంకట్రామాపురం, వరదప్పనాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులకు ఏనుగులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కల్లూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తూ రాత్రుల్లో గ్రామాలపైకి వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ పరిసరాలలో కందకాలు లేకపోవడం, అడవిలో నీరు లేకపోవడంతో పొలాలపైకి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుయా నేత్ర నిధికి కళ్లు దానం

తిరుపతి(వైద్యం), మే 22: గుండెపోటుకు గురై రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన వ్యక్తి కళ్లను అదే ఆస్పత్రిలోని నేత్ర నిధికి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు దానం చేశారు. స్థానిక కొర్లగుంటకు చెందిన మరియదాస్(75) గుండెపోటుతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నేత్ర నిధి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. మృతుడి మనవరాలు సంధ్య తన తాత కళ్లను దానం చేసేందుకు అంగీకరించింది. దీంతో మరియదాస్ కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్ర నిధిలో భద్రపరిచారు. తీరని దుఃఖంలోనూ అయిన వారి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేత్ర నిధి టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, మే 22: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చప్టాల అభివృద్ధికి చర్యలేవి?

హైలెవల్ వంతెన నిర్మాణానికి నోచుకోని తిప్పగుంటపాళెం చప్టా • అవస్థల్లో ఆయా గ్రామాల ప్రజలు



హై లెవెల్ వంతెనకు నోచుకోని తిప్పగుంటపాళెం చప్టా



అభివృద్ధికి నోచుకోని పారిచెర్లవారిపాళెం చప్టా

చిల్లకూరు, మే 22: మండలంలోని పలు చప్టాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం, నెలబల్లిరెట్టపల్లి, తిమ్మనగారిపాళెం గ్రామాల సమీపంలో చప్టాలున్నాయి. ఆయా చప్టాలు ఏళ్ల తరబడి అభివృద్ధి జరగక అధ్వానంగా మారాయి. ప్రధానంగా తిప్పగుంటపాళెం లోని ఉప్పుటేరుపై ఉన్న చప్టా అభివృద్ధి జరగకపోవడంతో గ్రామస్తులు వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. యేటా వర్షాల సమయంలో నీటి ప్రవాహం పెరిగి చప్టాపై నీరు ప్రవహిస్తుంది. దీంతో గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుని బయట ప్రపంచానికి సంబంధం లేకుండా పోతుంది. వాన తగ్గుముఖం పట్టాక ఏరు దాటేందుకు మరబోట్ల ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఈ ఉప్పుటేరుపై హై లెవల్ వంతెన నిర్మించాలని చాలా యేళ్లుగా గ్రామస్తులు కోరుతున్నారు. పారిచెర్లవారిపాళెం, నెలబల్లిరెట్టపల్లి, తిమ్మనగారిపాళెంల సమీపంలోని చప్టాలు పరిస్థితి కూడా ఇంతే. అధికారులు ఆయా చప్టాలపై హై లెవల్ వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాల్ని అందుకుంటున్న ప్రిస్కిల్లా, డాక్టరేట్ అందుకుంటున్న పీరకుమార్

గూడూరు, మే 22: విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో గూడూరు చర్చి కాంపౌండ్‌కు చెందిన విద్యార్థినీ ప్రిస్కిల్లా బంగారు పతకం అందుకుంది. 2021 సంవత్సరంలో విక్రమసింహపురి వర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదివిన ప్రిస్కిల్లా... 9.83 జీపీఏ సాధించింది. దీంతో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

అర్థశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్

గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రంలో అధ్యాపకుడు బద్రి పీరకుమార్ విక్రమసింహపురి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. బుధవారం నెల్లూరులో విక్రమసింహపురి వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పంటలు - వృద్ధి, అస్థిరత, సరఫరా ప్రతిస్పందనలు - అధ్యయనం'పై ప్రొఫెసర్ ఎన్‌ఆర్‌పీ రమణారెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు.

15 పంచాయతీల్లో ఉపాధి పనులకు బ్రేక్?

ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న ఏపీవో

కోట, మే 22: మండలంలోని 21 పంచాయతీలకు గాను 15 పంచాయతీల్లో కూలీలకు పనులు లేవని తేల్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో ఉపాధి హామి పథక పనులపై సమీక్షా సమావేశం జరిగింది. ఏడు పంచాయతీల్లో ఎన్నికల కౌంటింగ్ ముందు 93 పనులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ మంజూరు కాలేదు. మరో 8 పంచాయతీల్లో పనులు లేకపోవడంతో కొన్నింటికి మాత్రమే డ్వామా అధికారులకు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపింది. ప్రస్తుత వేసవిలో కూలీలకు పనులు లేకపోతే జీవనోపాధి కష్టతరమవుతుందన్న నేపథ్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రసహాయకులతో ఏపీవో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. పనులు సత్వరం మంజూరయ్యేందుకు పంచాయతీల వారీగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనుల్లో క్షేత్ర సహాయకులు నిమగ్నమయ్యారు.

ఆంధ్రప్రదేశా... ఆఫ్ఘనిస్తానా: బీజేపీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22: రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసీపీ చేసిన అరాచకాలకు సంబంధించిన 400 వీడియోలు ఇంటర్‌నెట్‌లో ఉన్నాయని చెప్పారు.మాచర్ల, పల్నాడు, తాడిపత్రి, చంద్రగిరి ప్రాంతాల్లో వైసీపీ అరాచకాన్ని తెలుపుతున్నాయన్నారు.స్ట్రాంగ్ రూంల వద్ద పరిస్థితి ఇలా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముందన్నారు.

కౌంటింగ్ సందర్భంగా

అల్లర్లకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ

దొరవారిసత్రం, మే 22: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆయన సింగనాలత్తూరులో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఫలితాలు వెలువడిన తరువాత కూడా సంబరాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. నాయుడుపేట సీఐ జగన్మోరావు, ఎస్ఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): 18వ శతాబ్దపు వేంకటేశ్వరస్వామి పరమ భక్తుల్లో ఒకరైన మాతృశ్రీ తరగొండ వెంగమాంబ 294వ జయంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో బుధవారం టీటీడీ వెంగమాంబ ప్రాజెక్ట్ సంచాలకులు భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి పుష్పాంజలి సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వెంగమాంబ వేంకటేశ్వరుడు, తరిగొండ లక్ష్మీనృసింహస్వామిపై గొప్ప రచనలు చేశారన్నారు. వెంగమాంబ ప్రాజెక్ట్ ద్వారా టీటీడీ ఆమె సాహిత్యాన్ని ప్రచారం చేస్తూ, ప్రతి ఏడాది తరిగొండ, తిరుపతి, తిరుమలలో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. శ్రీవారికి ఏకాంతసేవ సమయంలో అన్నమయ్యలాలి-వెంగమాంబ ముత్యాలహారతి నేటికీ కొనసాగుతున్నాయన్నారు. నాదనీరాజనం వేదికపై టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణప్రసాద్ వీనులవిందుగా ఆలపించారు.

తిరుచానూరులో అమ్మవారి వసంతోత్సవాలు ప్రారంభం

● నేడు స్వర్ణరథోత్సవం



బంగారు పీఠంపై పద్మావతిదేవి - స్నపన తిరుమంజనం

తిరుచానూరు, మే 22: తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని మధ్యాహ్నం ఆలయ సమీపంలోని ఫ్రైడే గార్డెన్స్‌కు వేంచేపుచేసి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో.. వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి నేత్రపర్వంగా అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పద్మావతిదేవి తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా వసంతోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.45గంటలకు అమ్మవారికి స్వర్ణ రథోత్సవం జరగనుంది.

మా కుమారుడిని చంపేశారు.. న్యాయం చేయండి

● పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులతో కలిసి తల్లిదండ్రుల ధర్నా



పాకాల పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న తలారిపల్లె గ్రామస్తులు - మురళి (ఫైల్ ఫొటో)

పాకాల, మే 22: 'మా కుమారుడ్ని హత్యచేసి రైలు కిందపడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. నిందితులను అరెస్టు చేసి.. న్యాయం చేయాలి' అని గ్రామస్తులతో కలిసి మృతుడి తల్లిదండ్రులు పోలీసుస్టేషన్ ఎదుట బుధవారం సాయంత్రం ధర్నా చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇరంగారిపల్లె పంచాయతీ తలారిపల్లెకు చెందిన సి.మునస్వామి, పార్వతి దంపతుల కుమారుడు మురళి (30), ఫకీరుపేటకు చెందిన చాన్‌బాషా కుమార్తె ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకున్నారు. అమ్మాయి మైనర్ కావడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న ప్రేమజంటను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నుంచి మురళి కనిపించకుండా పోయాడు. సోమవారం ఉదయం ఊట్లవారిపల్లె సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భావించి శవ పరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అమ్మాయి కుటుంబ సభ్యులే హత్యచేసి రైలు కిందపడేశారని మురళి తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం రాత్రి రఫీ, కర్ణ అతని భార్య, పెద్దమ్మ తమ కొడుకును చంపేశారని సీఐ రాజగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని బోరున విలపించారు.







పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యులతో పాటు రాపూరుకు చెందిన ఆర్‌ఎంపీలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. పెంచలకోన రోడ్డు మార్గంలో అక్కడక్కడా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తుల దాహార్తి తీర్చారు. అలాగే అన్నదానాలు జరిగాయి. కాగా స్వామివారిని దర్శించుకున్న ప్రముఖుల్లో ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డి వున్నారు.

- డక్కిలి

వైభవం... లక్ష్మీనరసింహుడి కల్యాణం



బాలాయపల్లి, మే 22: మండలంలోని అలిమిలి పంచాయతీలో కనుమరాయ కొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహుడి ఆలయంలో స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని కల్యాణ ఘట్టాన్ని తిలకించి పునీతులయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ మహబూబ్ సుబానిబందోబస్తు నిర్వహించారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో స్వామి - నృసింహుడి కల్యాణం - చందనాలంకారం

వెంకటగిరిటౌన్, మే 22: స్థానిక వల్లివేడు సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహాస్వామి 64వ జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సుప్రభాతం, స్వామివారికి అభిషేకం, కళ్యాణం నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు వచ్చి కళ్యాణంలో పాల్గొన్నారు. విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏటా స్వామివారి జయంతి సందర్భంగా 9వ బెటాలియన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చందనాలంకారం, భజన, గరుడోత్సవం చేసి భక్తులకు కనువిందు చేసింది.

విజయదుర్గాదేవికి చందనాభిషేకం



గూడూరు, మే 22: పట్టణంలోని సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో బుధవారం 16వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం విజయదుర్గాదేవికి, లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి చందనాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహానవావరణ హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

గరుడుడిపై నరసింహుడి విహారం



చిల్లకూరు, మే 22: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి విశేషపూజలు జరిపారు. ఆలయ ఆవరణలో గరుడాధీశుడైన స్వామివారిని ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

హనుమంతుడిపై

కరిమాణిక్యస్వామి పుర విహారం



నాయుడుపేట టౌన్, మే 22: నాయుడుపేట తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తిరిచ్చి ఉత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ జరిగాయి. ఉభయదారులుగా పసల గంగా ప్రసాద్, సువర్ణ దంపతులు వ్యవహరించారు. ఏర్పాట్లను టీటీడీ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి సహా సిబ్బంది పర్యవేక్షించారు.

రోడ్ల వెంబడి చికెన్ వ్యర్థాలు

పట్టించుకోని అధికారులు

బాలాయపల్లి, మే 22: చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో దుర్గంధం వెద జల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు - వెంకటగిరి మార్గంలో వెంకటగిరి నుంచి గూడూరు వరకు రోడ్ల వెంబడి చికెన్ వ్యర్థాలు కుప్పగా పోసేస్తుండడంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు దుర్గంధం భరించలేక ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చికెన్ వ్యాపారులపై చర్యలు తీసుకుని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్బీ డీఎస్పీగా వెంకటాద్రి బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ వెంకటాద్రి - సీఐలు రామారావు - విశ్వనాథ చౌదరి

తిరుపతి(నేరవిభాగం), మే 22: తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) డీఎస్పీగా వెంకటాద్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలులో ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాకు బదిలీపై వచ్చారు. 2013 నుంచి డీఎస్పీ హోదాలో హైదరాబాదులో మూడేళ్లు పనిచేసి 2016లో కర్నూలుకు వచ్చారు. అక్కడ స్పెషల్ బ్రాంచ్, ఏసీబీలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసి ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధనరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే అలిపిరి సీఐగా రామారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విశ్వనాథ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. వీరు కూడా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి హుండీ ఆదాయం రూ1.42కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, మే 22: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,42,89,870 వచ్చింది. బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 72 గ్రాములు, వెండి 487.800 కిలోలు, విదేశీ కరెన్సీ 124 వచ్చాయి. గత నెల 24 నుంచి ఈ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహవాహనంపై చెన్నకేశవుడి వైభవం



శ్రీకాళహస్తి, మే 22: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బుధవారం సింహ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప, దీపనైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి అమ్మవార్లు సింహ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులుస్వామి అమ్మవార్లను దర్శించుకునిమొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్న కొట్టాయి ఉత్సవం



ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, మే22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆఖరిరోజు చిన్న కొట్టాయి ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయం లోపల స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకునానరు. ఈకార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ



శ్రీకాళహస్తి, మే 22: పట్టణంలోని జయరామరావువీధిలోని కొత్తకోనేరు ఎస్టీకాలనీకి చెందిన పేద విద్యార్థులకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు త్రిభాషా నిఘంటువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మహబూబ్‌బాషా, సయ్యద్ చాంద్ బాషా, షేక్ హబీబ్, షేక్ రియాజ్, గాజుల భగత్, తుపాకుల ప్రసాద్, షేక్ జిలానీ, గులాం అహ్మద్ ఫరూఖీ, కోట చంద్రశేకర్, కృష్ణమూర్తి, శివ, సుబ్బరత్నమ్మ, మారెమ్మ, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి వీడ్కోలు

రేణిగుంట, మే 22: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీడ్కోలు పలికారు. బుధవారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం 10.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రేవంత్‌రెడ్డికి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, కాంగ్రెస్ నాయకులు వీడ్కోలు పలికారు.

టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు

రేణిగుంట, మే 22: రేణిగుంట మండలానికి చెందిన టీడీపీ నాయకులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. పోలింగ్ రోజున ఆర్.మల్లవరం పంచాయతీ సుబ్బయ్యకండ్రిగలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు సుబ్బయ్య కండ్రిగకు చెందిన ఎనిమిది మంది టీడీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 22: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ దివాకర్ తెలిపారు. మండలంలోని నీర్పాకోట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలుషితమైన నీరు తాగవద్దని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఇళ్లలో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పేరంటాలమ్మ ఆలయ హుండీ చోరీ

వరదయ్యపాళెం, మే 22: మండలంలోని చిన్నపాందూరు పంచాయతీలో గల పేరంటాలమ్మ ఆలయంలో హుండీ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. శ్రీసిటీ ఎస్ఐ గౌస్‌పీర్ కథనం మేరకు.. పేరంటాలమ్మ ఆలయంలో ఇటీవల పొంగళ్లు పెట్టారు. మంగళవారం రాత్రి పూజారి శంకర్ గుడి తలుపులు మూసుకుని ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా హుండీ చోరీకి గురైనట్లు గుర్తించాడు. అలాగే పోతురాజు కుడి చెయ్యి విరిగిపోయి ఉంది. దీంతో శ్రీసిటీ ఎస్ఐ గౌస్‌పీర్‌కు ఫిర్యాదు చేశారు.

యువకుడి వద్ద మొబైల్ లాక్కెళ్లిన దుండగులు

నాగలాపురం, మే 22: ఓ యువకుడు వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మొబైల్ ఫోన్ లాక్కొని పరారైన ఘటన నాగలాపురంలో చోటు చేసుకుంది. బాధితుడు ఫిర్యాదు మేరకు.. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో నాగలాపురానికి చెందిన హమీదుల్లా స్థానిక మసీదు సమీపంలో రోడ్డు పక్కన కూర్చొని తన సెల్‌ఫోన్ చూస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ యువకుడి వద్ద మొబైల్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తొండూరులో కార్డన్ సెర్చ్

వరదయ్యపాళెం, మే 22: మండలంలోని తొండూరు సొసైటీలో బుధవారం సత్యవేడు డీఎస్పీ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ఎస్ఐ శ్రీకాంత్, శ్రీసిటీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నానీకి పరామర్శ

పిచ్చాటూరు, మే 22: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని పిచ్చాటూరు టీడీపీ నాయకులు పరామర్శించారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, జయచంద్రనాయుడు, దొరవేలు, వినాయక తదితరులు బుధవారం పులివర్తి నానీని ఆయన స్వగృహంలో కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ నేతలకు ఆదిమూలం పరామర్శ

సత్యవేడు, మే 22: జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత సుందరరామిరెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పరామర్శించారు. సుందరరామిరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటూ దాసుకుప్పంలోని ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదిమూలం బుధవారం సుందరరామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు

ఏర్పేడు, మే 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా గెలవాలని ఏర్పేడు మండలం గోవిందరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అరుణాచలంలోని ఆరుణాచలేశ్వరస్వామికి బుధవారం పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పేరం చిరంజీవనాయుడు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం: ఎస్పీ



శ్రీకాళహస్తి, మే 22: శాంతిభద్రతలకు భంగం కలిగేలా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలోని పాత నేరస్థులు, సమస్యాత్మకంగా ప్రవర్తించే వ్యక్తుల జాబితాను సేకరించారు. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎవరి మీదయినా అనుమానం వస్తే ముందస్తుగా హౌస్ అరెస్టు చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీకాళహస్తి డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరుపతిలో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల రోజు జరిగిన పలు ఘటనలపై ఇప్పటికే 22 కేసులు నమోదు చేశామన్నారు. అందులో పాత్రదారులుగా ఉన్నవారిని అదుపులోకి తీసుకునేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని, ఇందు కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు వివరించారు. తిరుపతిలోని కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. జిల్లాలో 144సెక్షన్ కఠినంగా అమలు చేస్తున్నామని, ఫలితాలు వెలువడిన వారంరోజుల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. విజయోత్సవ సంబరాలను జరుపుకోవడానికి కూడా అనుమతిలేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఐలు నరసింహారావు, రారాజు, అజయ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురం వంక కాల్వ కబ్జా



వంకలో మట్టితోలి పూడ్చేసిన దృశ్యం

రేణిగుంట, మే 22: రేణిగుంట మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రేణిగుంట పాత విమానాశ్రయం వెళ్లే రోడ్డు వద్ద రామకృష్ణాపురం వంక కాల్వ దాదాపు 7.30ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ వంక కాల్వ రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రధాన రహదారిని దాటుకుని పొడుగునా ముగుగు, వరద నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న పట్టాదారులు కాలువలోకి మట్టి తోలి పూడ్చేసి ఆక్రమించేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దారు, వీఆర్వోను ఫోన్‌లో వివరణ కోసం సంప్రదించగా స్పందించలేదు.

ఘనంగా గంగజాతర

బుచ్చినాయుడుకండ్రిగ, మే 22: మండలంలోని పార్లపల్లి గ్రామంలో గంగమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా జరిపించారు. గంగమ్మ విగ్రహానికి, శూలానికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శేష, హంస వాహనాలపై కల్యాణ వెంకన్న



చిన్నశేష, హంస వాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం, మే 22: పద్మావతీ దేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారు శేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి, నిత్య పూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పిల్లనగ్రోవితో వేణుగోపాలుడిగా శేష వాహనంపై అధిష్టించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, దప్పుల వాయిద్యాలు, గోవిందనామ స్మరణల నడమ స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం నిత్యపూజల అనంతరం గంట పాటు వేద, నాద, గాత్ర కచ్చేరిలతో చేతి వీణతో సరస్వతీదేవిగా ఊంజలసేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మే 22: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం వెలసిన భక్తకన్నప్ప కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామికి బుధవారం జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామికి కలశ స్థాపన చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ఆలయ అర్చకులు పాలు, పెరుగు, చందనం, నారికేల జలాలు, కలశ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ అధికారులు నాగభూషణం, వేదపండితులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు - అన్నదానం చేస్తున్న జగన్నాథం నాయుడు

ఘనంగా సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, మే 22: ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో బొజ్జల యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీ, ప్రవీణ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. దశరధాచారి, మిన్నల రవి, వజ్రం కిషోర్, మధు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద రావిళ్ల మునిరాజానాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని బీపీ అగ్రహారం కూడలి వద్ద పోలూరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కంఠా రమేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయంలో తెలుగు యువత పట్టణ ఉపాధ్యక్షుడు వంకాయల సిద్ధులయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నేత జగన్నాథం నాయుడు తన కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. కొత్తపేట కార్గిల్ సెంటర్ వద్ద మైనారిటీ నేత జావిద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. షాకీర్‌అలీ, దశరధాచారి, జయచంద్ర నాయుడు, షఫీ, ఖలీల్‌బాషా, గిరి, చాంద్‌బాషా, సాజిత్, మధుసూదనరావు, మునిరాజా యాదవ్, ధనంజయులు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం తొండమానుపురం వద్ద టీడీపీ మండల అధ్యక్షులు కామేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అమ్మపాళెంకు చెందిన కందాటి రాఘవరెడ్డి, అలేఖ్య దంపతులు కేక్ కట్ చేశారు. తొట్టంబేడులో టీడీపీ మండల అధ్యక్షుడు మురళీనాయుడు, బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

రేణిగుంట: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా, తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, నాయకులు మునస్వామి నాయుడు, చిన్నారెడ్డి, పుష్పనాధన్, ఎంజీరెడ్డి, మేరీ, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండల కేంద్రంలో బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నారావు, గోపాల్‌రెడ్డి, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్ నాయుడు, ఊటీ చంద్రశేఖర్ యాదవ్, గుణయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులుయాదవ్, గాలి కృష్ణవేణి, వెంకటరమణయాదవ్, సురేంద్ర యాదవ్, నిరంజన్‌బాబు పాల్గొన్నారు. అలాగే పాపానాయుడుపేటలో కేక్ కట్ చేశారు. ముత్తప్ప మొదలి, ఉమా, మురుగన్, సీతాపతి ఆచారి, కృష్ణయ్య, కృష్ణప్ప మొదలియార్, సూర్యప్రకాష్, రవికుమార్, అర్జున్‌బాబు, రోశయ్య, జాఫర్, తంబా శ్రీను, సురకాని శ్రీనివాసులు, ఎలుమలై, బుల్లెప్ప, శివ తదితరులు పాల్గొన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని గోవిందవరంలో వినాయకస్వామికి పూజలు చేశారు. నాగరాజునాయుడు, మహేష్‌నాయుడు, రమేష్ చౌదరి, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు



పుత్తూరు, మే 22: పట్టణంలోని సదాశివేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. తిరువణ్ణామలైలో పౌర్ణమి సందర్భంగా జరిగే ఉత్సవంలా ఇక్కడ కూడా పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ రమేష్‌బాబు తెలిపారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం

పుత్తూరు టౌన్, మే 22: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చని పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గ్రీన్ క్రాస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా పుత్తూరు ఆయుర్వేద నిలయం ఆధ్వర్యంలో యోగా మాస్టర్ సుబ్రహ్మణ్యం చేతల మీదుగా ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ ఆయుర్వేదంలో అశ్వగంధ దివ్య ఔషధమని, వ్యాధి నిరోధక శక్తికి అద్భుతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో త్రినేత్ర దివ్య దేవాలయ ధ్యానకేంద్రం సభ్యులు పాల్గొన్నారు.



ఔషధ మొక్కలను పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రాజు

మృతుల కుటుంబానికి భానుప్రకాష్ పరామర్శ



బాబు దంపతులను పరామర్శిస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, మే 22: మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బాబు, విజయ దంపతులను నగరి అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. ఇటీవల బాబు దంపతుల ముగ్గురు కుమార్తెలు గూళూరు చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం బాబు దంపతుల భానుప్రకాష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధులు చినబాబు, ధనంజయులు నాయుడు, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు శ్యామయ్య, పెద్దబ్బరాజు, సుకుమార్, రవి, యాయతి, భాను, హరిరాజు, నారాయణరాజు, మాధవరాజు, దామోదర్‌రాజు, చిరంజీవి, హరి, శివ తదితరులు ఉన్నారు.